## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఓబీసీ మోర్చా ప్రతినిధులు

కాచిగూడ, జూలై 18: తెలంగాణలో పనిచేస్తున్న కల్లు గీత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను ఓబీసీ మోర్చా గీతాసెల్ రాష్ట్ర ప్రతినిధులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గీతాసెల్ రాష్ట కన్వీనర్ పటేల్ వెంకటేశ్‌గౌడ్, కోకన్వీనర్లు మీరయ్యగౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్, టి.కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి వైభవం-2 పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, జూలై 18 : గీతా ఫౌండేషన్, లక్ష్య సాధన ఫౌండేషన్, నక్కా వెంకటమ్మయాదవ్, నక్కా యాదగిరి స్వామి ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో యాదాద్రి వైభవం-2 పుసకావిష్కరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా విజయలక్ష్మి ఆలయ ప్రధాన అర్చకులు గట్టు అరుంధతి రంగాచార్యులు, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, బీసీ పొలిటికల్ జేఏసీ రాచాల యుగంధర్‌గౌడ్, గంటా మనోహర్‌రెడ్డి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించి పలువురు కవులు, కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు చేయూత



గోల్నాక క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూలై 18: పేదలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురువారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.9లక్ష ల విలువగల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అనారోగ్యానికి గురై దవాఖానల్లో చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

రవీంద్రభారతి, జూలై 18: ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదింప చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ చెప్పారు. బషీర్‌బాగ్‌లో తెలంగాణ ఎమ్మార్పీఎస్ కో ఆర్డినేటర్ మాతంగి ఓదెలు మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రహ్మయ్య మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ రంగాలలో రావాల్సిన వాటా కోసం పోరాటం చేస్తున్నామని అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాలలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి మాదిగలకు రాజకీయ, ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహమాదిగ, జగన్ మాదిగ, విజయ్ మాదిగ, కోటి, బాలకృష్ణ, ఆర్‌ఎన్ రాజు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టాలి



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం సమర్పిస్తున్న గన్‌ఫౌండ్రి కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సురేఖ

అబిడ్స్, జూలై 18 : పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని గన్‌ఫౌండ్రి కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నగరంలో కాంట్రాక్టర్లకు ఉన్న కోట్లాది రూపాయల బకాయిలను చెల్లించక పోవడంతో అభివృద్ధి పనులు నిలిచి పోయాయన్నారు. అనేక ప్రాంతాలలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని, చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చౌరస్తాలలో చెత్త వేయకుండా ఉండడానికి ఎలక్ట్రానిక్ డివైస్‌ను తయారు చేసినట్లు వివరించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి అందరూ కృషి చేయాలి



ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్ కోరారు. లక్ష్య-లక్ష్యం కార్యక్రమంలో భాగంగా మహిళా సిబ్బందికి డిపోలో వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు.

– కాచిగూడ, జూలై 18

## బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న వీజీఆర్ నారగోని

చిక్కడపల్లి, జూలై 18 : బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమం చేపడుతున్నట్లు నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్(ఎన్‌పీజేఎఫ్) చైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. గురువారం అశోక్‌నగర్‌లోని నేషనల్ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలన అంతా ఒకే సామాజిక వర్గం చేతిలోకి వెళ్లిందన్నారు. అన్ని రంగాల్లో బీసీలను అణిచివేయడం జరుగుతోందని, ఇటీవలే కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో కూడా బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్న రాహుల్ గాంధీ రాజ్యాంగంలోని ఏ ఒక్క అంశాన్ని కూడా కాంగ్రెస్ పార్టీలో అమలు చేసే స్థితిలో లేదన్నారు. ప్రజాస్వామిక ఉద్యమంలో సీట్లు ఇవ్వని పార్టీలకు ఓట్లు వేయవద్దు అనే నినాదంతో ఓటు నిరాకరణ ఉద్యమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీల్లో రాజకీయ చైతన్యం లేని కారణంగా అగ్రకులాల ఆధిపత్యం పెరిగిపోతుందని అన్నారు. ఈ సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్ ఎం.నర్సయ్య, ఎ.లక్ష్మణ్, బోయ గోపి, కె.బి.శ్రీధర్, పాడేటి పాల్, తుపాకుల సుమత, డాక్టర్ దేవసేన, పుష్పంజాలి, సరిత తదితరులు పాల్గొన్నారు.



## సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి గోల్కొండ బోనాల కులవృత్తుల సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కులవృత్తుల సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, పూజారి సురేశ్‌చారి, నాయకులు శివరాజ్, ప్రసాద్, వినోద్, విజయ్, నవీన్, శివశంకర్, పటేల్ భార్గవ్, మల్లేశ్, శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జూలై 18

## ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలి : రాంచందర్



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్

రవీంద్రభారతి, జూలై 18 : కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. గురువారం సామ్రాట్ భవన్‌లోని అంబేద్కర్‌హాల్‌లో మాల సంఘాల జేఏసీ ఉమ్మడి పది జిల్లాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. ఆగస్టు 9వ తేదీన 'హలో మాల ఛలో ఢిల్లీ' కార్యక్రమన్ని నిర్వహించి జంతర్ మంతర్ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలని, ఆర్టికల్ 341 ప్రకారం షెడ్యూల్ కులాలను విభజించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం వైఖరిని మార్చుకోవాలని కోరారు. చీఫ్ అడ్వైజర్ అంజయ్య, కె. బాలకృష్ణ, వర్కింగ్ చైర్మన్ నరసింహయ్య, గడ్డం సత్యనారాయణ, దాసరి భాస్కర్, ఎస్ నాగేశ్, ఎస్.నాను తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు రావాలని ఆహ్వానం



పాతబస్తీ బోనాల ఉత్సవాలలో పాల్గొనాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ సి. రాజేందర్‌యాదవ్, ప్రతినిధులు వెంకటేశ్ తదితరులు.

– అబిడ్స్, జూలై 18

## అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మెహిదీపట్నం, జూలై 18: ప్రజలు వర్షాకాలం దృష్యా విష జ్వరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని గోల్కొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లా అన్నారు. ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే సమీప డాక్టర్లను సంప్రదించాలని, గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో అన్నీ రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలి



ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. నానల్‌నగర్,టోలిచౌకి డివిజన్‌లలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే మెరాజ్ కాలనీ,హకీంపేట్,అల్‌హస్నత్ కాలనీ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు నీటి సరఫరా సక్రమంగా లేదని ఫిర్యాదులు చేయడంతో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నీటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు.

– మెహిదీపట్నం, జూలై 18

## హోరాహోరీగా మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్

- అగ్రస్థానంలో ఏకలవ్య



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ వేదికగా 15వ మాన్‌సూన్ రెగెట్టా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీల నాలుగో రోజు గురువారం అన్ని విభాగాల్లో రెండేసి రౌండ్ల రేసులు నిర్వహించారు. బాలుర ఐఎల్‌సీ-4 విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాతం అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇదే కేటగిరీలో అక్షత్(మధ్యప్రదేశ్), కృష్ణదివాకర్(మైసూర్) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. మరో వైపు అండర్-16 అప్టిమిస్ట్ ఫ్లీట్ విభాగంలో తెలంగాణకు చెందిన గోవర్ధన్ టాప్‌లో కొనసాగుతున్నాడు. 8,9 రౌండ్ రేసుల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన గోవర్ధన్ పసిడి పతకం దిశగా దూసుకెళుతున్నాడు. రాష్ట్రానికే చెందిన దీక్షిత 9వ రేసులో 14వ స్థానం నుంచి దూసుకొచ్చి ఆశ్చర్యపరిచింది. అండర్-18 అంతర్జాతీయ 420 మిక్స్‌డ్ డబుల్స్‌లో వైష్ణవి, శ్రవణ్, తనూజ, గణేశ్ జోడీలు తొలి రెండు స్థానాలను నిలబెట్టుకున్నాయి.

## చెత్తకుప్పల తొలగింపు..



బాగ్‌అంబర్‌పేట డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ పార్కు వద్ద చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఈ విషయాన్ని గమనించిన కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి గురువారం ఉదయం పారిశుధ్య కార్మికులను పిలిపించి చెత్తకుప్పలను తొలగింపజేశారు. డివిజన్‌లో ఎక్కడ కూడా చెత్తకుప్పలు కనిపించకూడదని వారికి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, గోవిందు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, జూలై 18


## నాంపల్లిలో సమస్యలు పరిష్కరిస్తాం



బస్తీలలో ప్రజలకు సమస్యలు లేకుండా కృషి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. గురువారం మెహిదీపట్నం,ఆసిఫ్‌నగర్, హుమాయూన్‌నగర్ ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు.

– మెహిదీపట్నం, జూలై 18

## ట్రాఫిక్ డీసీపీని కలిసిన కన్నడిగాస్ సొసైటీ సభ్యులు



హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌హెగ్డేను అసెంబ్లీ ఎదురుగా ఉన్న కార్యాలయంలో గురువారం కన్నడిగాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ధర్మంద్రేపూజారి, ఉపాధ్యక్షుడు భస్వరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పలు కన్నడ ఆధ్యాత్మిక గ్రంథాలను బహూకరించారు.

– తెలుగు యూనివర్సిటీ

## లంగర్‌హౌస్‌లో పట్టపగలే దొంగతనం

### స్థానికుల చాకచక్యంతో దొరికిన దొంగ

మెహిదీపట్నం జూలై18 : ఓ ఇంట్లో దొంగలు పడి బంగారం దొంగిలించుకుని పారిపోతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దొంగ దొరికిన ఘటన లంగర్‌హౌస్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లంగర్‌హౌస్ బాపూఘాట్ ఎదురుగా ఉన్న గాంధీనగర్‌లో జనార్దన్‌చారి బుధవారం మధ్యాహ్నం మొయినాబాద్ సమీపంలోని నాగిరెడ్డిగూడలో బంధువుల ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం వీరి ఇంట్లో శబ్దం వస్తుండటంతో పక్కింటి వారు గమనించి జనార్దన్‌కు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఆయన డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకోగా ఒక దొంగ చిక్కాడు. జనార్దన్ వచ్చి చూడగా 25 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపాడు. ఈ విషయమై పోలీసులు దొంగను విచారిస్తున్నారు.

## అనుమానాస్పదస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ,జూలై 18: వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం.. గుర్తుతెలియ ని వ్యక్తి మృతదేహం అనుమానాస్పదస్థితిలో బుద్వేల్-ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య కాటేదాన్ రైల్వే అండర్ బ్రిడ్జిపై కుళ్లిపోయి ఉన్నట్లు బుధవారం తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై ఎరుపు రంగు టీషర్ట్, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించి ఎత్తు.5.5 ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసే వరకు పోరాటం ఆగదు

- ప్రతి పక్ష హోదాలో గతంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్



ధర్నాలో పాల్గొన్న ఎం. నరసింహ

సుల్తాన్‌బజార్, జూలై 18: 17 సంవత్సరాలుగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేసేంత వరకు ఏఐటీయూసీ పోరాడుతూనే ఉంటుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ వెల్లడించారు. రెండవ ఏఎన్‌ఎంలను బేషరతుగా రెగ్యులర్ చేయాలని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పీఆర్‌సీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, యాప్‌లను మెర్జ్ చేసి పని ఒత్తిడి తగ్గించాలని తదితర డిమాండ్‌లతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు నెలలో జరిగిన సమ్మె సందర్భంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు నాడు ప్రతిపక్షంలో ఉండి సమ్మె శిబిరాన్ని సందర్శించి రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తే రెండవ ఏఎన్‌ఎంల ను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏఎన్‌ఎంల సంఘం గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ రిటైర్మెంట్ అయ్యే సమయంలో రూ. ఐదు లక్షల లైఫ్ టైం గ్రాట్యుటీని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెండవ ఏఎన్‌ఎం సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బోయిని శ్యామల, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పి.పద్మ, పి.జయమ్మ, ఉపాధ్యక్షురాలు హారతి, రాష్ట్ర నాయకురాళ్లు రాజేశ్వరి, గుణవతి, తమ్మిశెట్టి జయమ్మ, సదాలక్ష్మి, సరోజ, బాలనాగమ్మ, భూక్యా జ్యోతి, సరిత, సావిత్రి, అశ్విని పాల్గొన్నారు.

## సంతానం లేమిపై ప్రజల్లో అవగాహన పెరగాలి



సంతానం లేమి పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా టుగెదర్ ఇన్ ఐవీఎఫ్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీధి నాటకాలు, ఇతర కార్యకలాపాల ద్వారా వధ్యత్వం ఐవీఎఫ్ చికిత్సల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృత స్థాయి ప్రచారాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మిస్టర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

– రవీంద్రభారతి, జూలై 18

## డివిజన్ అభివృద్ధికి కృషి : ఉమాయాదవ్



రాజకీయాలకు అతీతంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. చెప్పల్‌బజార్‌లో గురువారం ఆమె పాదయాత్ర నిర్వహించి నీటి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలుషిత నీరు రాకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, జలమండలి ఏఈ భావన, నర్సింహ, బాలప్రసాద్, మల్లికార్జున్, రవియాదవ్, రాకేశ్ పాల్గొన్నారు.

– కాచిగూడ,జూలై 18

## సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల స్వీకరణ

అబిడ్స్, జూలై 18 : గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గం ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం గౌలిగూడలో ఫిర్యాదులను స్వీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకోసం తయారు చేసిన పోస్టర్‌ను ఫౌండేషన్ చైర్మన్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జై శంకర్ తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్


## చెట్టుపై కూరుకుపోయిన హైటెన్షన్ వైర్లు స్పందించిన నల్లకుంట కార్పొరేటర్

అంబర్‌పేట, జూలై 18 : నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో ఓ ఇంటి వద్ద బాదం చెట్టుపై హైటెన్షన్ వైర్లు కూరుకుపోవడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంటలు రావడంతో ఆ ఇంటి వారు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత ఘటనా స్థలానికి వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.



షార్ట్‌సర్క్యూట్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వై.అమృత

## అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా బి.జాసన్



చిక్కడపల్లి, జూలై 18 : అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (ఏసీఎల్) -3గా బి.జాసన్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బి.జాసన్ హైదరాబాద్ ఏసీఎల్ -3కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మికులు సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

## కార్పొరేటీకరించడానికి కేంద్రం ప్రయత్నం



మాట్లాడుతున్న హరగోపాల్

చిక్కడపల్లి, జూలై18 : దేశాన్ని కార్పొరేటీకరించడా నికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని ప్రొ. హరగోపాల్ అన్నారు. అమరుల బంధు మిత్రుల సంఘం 22వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరులను స్మరించుకుందాం కగార్ యుద్ధాన్ని ఎదిరిద్దాం పేరట బహిరంగ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ హాజరై మాట్లాడారు. సంఘం నాయకురాలు అంజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు నారాయణ, విరసం నేత రివేరా, నాయకులు డేవిడ్ పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆడిక్‌మెట్ రోడ్ శాఖ, 1-9-647, డా. కె.ఎల్.రావు రెసిడెన్సీ, విద్యానగర్, హైదరాబాద్-500 044 ద్వారా దిగువ తెలిపిన డాక్యుమెంట్ పోయినది లేదా దొరకలేదని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. నెం. 6238/2017 కలిగిన రిజిస్టర్డ్ సేల్‌డీడ్, రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, గోపన్‌పల్లి గ్రామం, మై హోమ్ విహంగలో 2 కార్ పార్కింగ్స్‌తోసహా (బేస్‌మెంట్-Iలో నెంబర్స్ 25 & 26 కలిగినది) టవర్ నెం. 1, బ్లాక్ నెం. 1లో 9వ అంతస్తుపై నివాస ఫ్లాట్ నెం. 902 కలిగిన కామన్ ఏరియాతోపాటు సూపర్ బిల్టప్ ఏరియా 2160 చ.అ. విస్తీర్ణంగల నివాస ఫ్లాట్ యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ, తూర్పు: కామన్ కారిడార్ & ఖాళీ, పడమర: ఖాళీ.

శ్రీ ఇలినేని కరుణాకర్ రావు పేరునగల ఆస్తి డాక్యుమెంట్ వారు పొందిన హౌసింగ్ లోన్ నిమిత్తం తనఖా పెట్టబడినది. సదరు డాక్యుమెంట్ పోయినందున నల్లకుంట పోలీస్ స్టేషన్, విద్యానగర్‌లో కంప్లయింట్ దాఖలు చేయబడినది. సదరు డాక్యుమెంట్‌పై ఏదేని క్లెయిమ్/అభ్యంతరం/ప్రయోజనంగల ఎవరేని వ్యక్తి సదరు నోటీసు తేదీ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన చిరునామాలో బ్యాంకుకు వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను. సదరు కాలవ్యవధిలోగా ఎలాంటి క్లెయిములు అందనిచో, సంబంధిత రిజిస్ట్రార్ నుండి సర్టిఫైడ్ కాపీలను పొందుటకు ప్రక్రియ ప్రారంభించబడును.

సం/- బ్రాంచ్ మేనేజర్